నిఘా నేత్రాలపై పట్టింపేది?

- నిర్వహణ లోపంతో నిరుపయోగంగా సీసీకెమెరాలు
- మండల కేంద్రంలో ఏడాదిగా పనిచేయని వైనం
- వినియోగంలోకి తీసుకురావాలని ప్రజల విజ్ఞప్తి



పెగడపల్లి నంది కూడలిలో పని చేయని సీసీ కెమెరాలు

పెగడపల్లి: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం. ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని తరచూ పోలీసు అధికారులు అంటుంటారు. ప్రతి గ్రామంలో సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలంటూ ప్రజలను ప్రోత్సహించారు. రెండేళ్ల క్రితం పెగడపల్లి మండలంలోని పలు గ్రామాల్లో 'నేను సైతం' కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రజల సహకారంతో నిఘా కెమెరాలు ఏర్పాటు చేయించారు. అయితే ఏర్పాటు చేసిన ఏడాది వరకు సక్రమంగానే పని చేశాయి. వీటి నిర్వహణపై పోలీసు అధికారులు శ్రద్ధ చూపకపోవడంతో నిర్వహణ లేక ఒక్కొక్కటిగా నిరుపయోగంగా మారాయి.

ఏడాదిగా పనిచేయడం లేదు..

పెగడపల్లి నంది విగ్రహం, అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయడం లేదు. మండల కేంద్రంలో దొంగతనాలు లాంటి ఘటనలు జరగకుండా, ఏదైనా ఘటన జరిగినా వెంటనే నిందితులను పట్టుకోవడానికి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఏడాదికాలంగా పని చేయడం లేదు. నిఘా నేత్రాల ఏర్పాటు ద్వారా వాటితో ఉన్న ప్రయోజనాలు, ఆవశ్యకతపై పోలీసులు అవగాహన కల్పించడంతో రెండేళ్ల కిందట ప్రజలు, వ్యాపారస్తుల భాగస్వామ్యంతో మండల కేంద్రంలోని బస్టాండ్, అంబేడ్కర్ చౌరస్తా, నంది విగ్రహం, పోలీస్‌స్టేషన్ వద్ద సుమారు రూ.1.50లక్షలు ఖర్చు చేసి మొత్తంగా 12 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

నిర్వహణపై శ్రద్ధ కరువు..

పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసినవి మినహా నిర్వహణ లోపంతో మరెక్కడా కూడా సీసీ కెమెరాలు పని చేయడం లేదు. ఇంత మొత్తంగా ఖర్చుచేసి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిరుపయోగంగా మారాయని ప్రజలు వాపోతున్నారు. ఏదైనా ఘటనలు జరిగితే ఎలా అని మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నిఘా వ్యవస్థ పటిష్టం చేసేందుకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు పోలీసులను కోరుతున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసులకు సహకరించిన ఔత్సాహికులు.. పోలీసులు వాటి నిర్వహణపై శ్రద్ధ చూపాలని కోరుతున్నారు.

మరమ్మతు చేయాలి



మండల కేంద్రంలో పని చేయకుండా నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలకు మరమ్మతు చేయాలి. సీసీ కెమెరాలు పనిచేస్తే నేరాలు జరిగిన సందర్భాల్లో నిందితులను వెంటనే గుర్తించి శిక్షించే అవకాశం ఉంటుంది. నేరాలు, దొంగతనాలు కూడా అదుపులో ఉంటాయి.

– కట్ల లక్ష్మన్, వ్యాపారస్తుడు, పెగడపల్లి

పట్టించుకోవడం లేదు



ప్రజల భాగస్వామ్యంతో మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయడం లేదు. మరమ్మతు విషయంలో వీటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన పోలీసులు వీటి నిర్వహణ మర్చిపోయారు.

– మాదారపు ప్రశాంత్‌రావు, పెగడపల్లి

ప్రజలు సహకరించాలి

మండల కేంద్రంలోని సీసీ కెమెరాలు కొన్ని రోజుల నుంచి పని చేయడం లేదు. ఈ విషయాన్ని పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి సీసీ కెమెరాలకు మరమ్మతు చేసి త్వరలోనే వినియోగంలోకి తీసుకువస్తాం. నేరాల నియంత్రణ విషయంలో ప్రజలు పోలీసులకు సహకరించాలి. మండలంలో కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలి.

– సత్తయ్య, స్టేషన్ హౌజ్ ఆఫీసర్

క్లుప్తంగా

అనాథ వృద్ధాశ్రమానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని శివ గాయత్రి అనాథ వృద్ధాశ్రమానికి ఆదివారం దాతలు రూ.30వేలు ఆశ్రమ నిర్వాహకుడు సూరజ్ శివ శంకర్‌కు అందజేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని బోయవాడకు చెందిన ఎంపీటీ చరణ్ తన తండ్రి వెంకటస్వామి జ్ఞాపకార్థం రూ.20వేల విరాళం ఇవ్వగా, జగిత్యాల పట్టణానికి చెందిన కాసం ప్రదీప్‌కుమార్ రూ.5వేలు, అనుపురం శ్రీధర్ రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపటి పద్మ, వర్ష, రాము, దీపిక, ఎనుగుర్తి ప్రసాద్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతి ప్రదానం



ట్రోఫీతో విజేత జట్టు

సారంగాపూర్(రాయికల్): రాయికల్ పట్టణంలో ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘం పట్టణశాఖ ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. కాగా నిర్వాహకులు విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. రాయికల్ పట్టణానికి చెందిన ఆకు రాజేందర్ సారథ్యంలోని టీమ్ విజేతగా నిలిచింది. నిర్వాహకులు గుర్రం రత్నాకర్, పుర్రె శ్రీనివాస్ బహుమతి ప్రదానం చేశారు. న్యాయవాది అల్లె పురుషోత్తం, సంజీవ్, శ్రీనివాస్, సుభాష్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మల్లాపూర్: ఛత్రపతి సాహు మహరాజ్ విగ్రహ ఆవిష్కరణ చలో వర్షకొండ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు బోడ ప్రశాంత్ కోరారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలోని భరతమాత కూడలి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో చలో వర్షకొండ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు గుజరి ప్రకాష్, సుద్దపల్లి రంజిత్, బొబ్బిలి గోపి, అంబేడ్కర్ సంఘం నాయకులు బండారి రమేశ్, పెద్దిరెడ్డి లక్ష్మణ్, కోరుట్ల నరేశ్, జెల్ల శేఖర్, నల్ల లక్పతి, అరిగడ్డి పెద్దులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా ప్రతాప్‌రెడ్డి



ప్రతాప్‌రెడ్డిని సన్మానిస్తున్న బండి సంజయ్

కథలాపూర్: బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా బొమ్మెన గ్రామానికి చెందిన పిడుగు ప్రతాప్‌రెడ్డిని నియమిస్తూ మండలశాఖ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతాప్‌రెడ్డి సేవలను గుర్తించి బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు నాయకులు తెలిపారు. ప్రతాప్‌రెడ్డిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ సన్మానించారు. అనంతరం బీజేపీ మండలాధ్యక్షుడు కంటె సత్యనారాయణ, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, గాంధారి శ్రీనివాస్, రాచమడుగు శ్రీనివాస్‌రావు సన్మానించారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలి



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

పెగడపల్లి: బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా బీఎస్పీ కార్యకర్తలు ముందుకు సాగాలని పార్టీ ధర్మపురి నియోజకవర్గం ఇన్‌చార్జి నక్క విజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు పార్టీ నియోజకవర్గం కార్యకర్తలు సమావేశం పెగడపల్లి మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 95శాతం ఉన్న బహుజనులకు రాజ్యాధికారం దక్కకపోవడం ఐక్యమత్యం లేకపోవడమే కారణమన్నారు. ఇప్పటికైనా బహుజనులు ఏకతాటిపైకి వచ్చి బహుజన రాజ్యస్థాపనకు నడుం బిగించాల్సిన అవసరముందన్నారు. పెగడపల్లి, వెల్గటూర్, ధర్మారం మండల అధ్యక్షులు గంగాధర్, స్వామి, ప్రశాంత్, మహిళా విభాగం అధ్యక్షులు లీలాగౌడ్, షాహీనా బేగం, నాయకులు తిరుపతి, రమేశ్, సైదులు, వెంకటేశ్, అనిల్‌కుమార్, రవి, శేఖర్, సాయికుమార్ పాల్గొన్నారు.

బస్సు ప్రమాద బాధితులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పెగడపల్లి: కొండగట్టు ప్రమాద బాధితులను సీఎం కేసీఆర్ ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపల్లి సత్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఆదివారం పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒక్కటైన కొండగట్టు ఆలయ అభివృద్ధిని టీఆర్‌ఎస్ ప్రభుత్వం విస్మరించడంతోనే ఆర్టీసీ బస్సు ప్రమాదం జరిగి 63 మంది మృతి చెంది వారి కుటుంబాలు రోడ్డున పడితే సీఎం పరామర్శించి వారికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించకపోవడం విచారకరమన్నారు. రైతుచట్టాల పేరిట కొందరు పంజాబు ఏర్పాటుదారులు ఎక్కడో నిరసన కార్యక్రమాలు చేపట్టి చనిపోతే వారి కుటుంబాలకు రూ.3లక్షల చొప్పున సాయం అందజేసిన ప్రభుత్వానికి కొండగట్టు బస్సు ప్రమాద బాధితులు గుర్తుకు రాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా కొండగట్టు బస్సు ప్రమాద బాధితుల్లో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించి ఆర్థికసాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొమురెల్లి, నాయకులు రవీందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, బాబు, నరేందర్, అంజి, కరుణాకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, లతీశ్, సాగర్ పాల్గొన్నారు.

బంజారాలకు స్ఫూర్తి ప్రదాత సేవాలాల్ మహరాజ్



మల్లాపూర్‌లో సేవాలాల్ ఉత్సవాలు

మల్లాపూర్: బంజారా(లంబాడీ)ల ఆరాధ్యదైవం, స్ఫూర్తి ప్రదాత సంత్ శ్రీసేవాలాల్ మహరాజ్ అని పీసీసీ డెలిగేట్ సభ్యులు జువ్వాడి నర్సింగరావు, ఎలాల జలపతిరెడ్డి, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం శ్రీసేవాలాల్ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో నిర్వహించిన సంత్ శ్రీసేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాల్లో వేర్వేరుగా మండల ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి వారు పాల్గొన్నారు. ఫిబ్రవరి 15న సేవాలాల్ జయంతిగా ప్రభుత్వం సాధారణ సెలవుదినంగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. రైతుబంధు కమిటీ మండల అధ్యక్షుడు కొమ్ముల జీవన్‌రెడ్డి, ఎంపీటీసీలు ఆకుతోట రాజేశ్, మరిపెల్లి సత్తెమ్మ, వీడీసీ చైర్మన్ సంగ రాజన్న, నాయకులు క్యాతం జీవన్‌రెడ్డి, పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, మరిపెల్లి మల్లయ్య, కోటగిరి ఆనంద్‌గౌడ్, సిరిపురం రవీందర్, గిరిజన పెద్దలు ఇస్లావత్ శ్రీనివాస్, ఇస్లావత్ తిరుపతి, రాజేందర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ బీజేపీ గీత సెల్ మండల అధ్యక్షుడిగా సత్తయ్యగౌడ్

సారంగాపూర్(రాయికల్): బీజేపీ అనుబంధ గీత సెల్ మండల కన్వీనర్‌గా రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన సుంకిశాల సత్తయ్యగౌడ్, జాయింట్ కన్వీనర్‌గా ఒడ్డెలింగాపూర్ గ్రామానికి చెందిన నాగుల రమేశ్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా తమ నియామకానికి కృషిచేసిన బీజేపీ జగిత్యాల అసెంబ్లీ కన్వీనర్ చిలుకమర్రి మదన్‌మోహన్, నియోజకవర్గ నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు అన్నవేని వేణుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

✦ అనాథ బాలికకు ఆర్థికసాయం

మేడిపెల్లి: భీమారం మండల కేంద్రానికి చెందిన ఈర్ల అలేఖ్య అనే బాలిక తన తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మారింది. కాగా పలువురు ఆదివారం ఆర్థికసాయం అందించారు. జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు రూ.5వేలు ఆర్థికసాయం అందించి ఉన్నత చదువులు చదివించేందుకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ 50 కిలోల బియ్యం బాలిక ఇంటికి పంపించారు.

✦ రెడ్డిసంఘం అధ్యక్షుడిగా గోపాల్‌రెడ్డి

కొడిమ్యాల: మండలంలోని పూడూరు రెడ్డి సంఘం అధ్యక్షుడిగా ఉప్పుగండ్ల గోపాల్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం రెడ్డి సంఘం కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యక్షుడిగా బండ మనోహర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ముదుపు మహేందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా గుడి రాజశేఖర్‌రెడ్డి, నలువాల మహిపాల్‌రెడ్డి, బండ రాజశేఖర్‌రెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ బండ రవీందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ బండ లింగారెడ్డి, మాజీసర్పంచ్ వెల్ముల రాంరెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ అబ్బిడి మల్లారెడ్డి పాల్గొన్నారు.

✦ నేడు మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై సమావేశం

సారంగాపూర్(రాయికల్): మహాశివరాత్రి జాతర సందర్భంగా రాయికల్ మండలం కొత్తపేట శ్రీరాజరాజేశ్వర నాగాలయం వద్ద జరిగే జాతర ఉత్సవాలపై సోమవారం ఉదయం 10 గంటలకు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అనిల్ తెలిపారు. జాతరలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేపట్టడంపై ఈ సమావేశంలో నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొన్నారు.

✦ ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందించాలి

మెట్‌పల్లి: ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందించాలని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొనికెల నవీన్ ఆదివారం డిమాండ్ చేశారు. ప్రతి నెలా వేతనాల విషయంలో జాప్యం జరుగుతుండడంతో ఉద్యోగులు ఎన్నో విధాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

✦ ఉచిత వైద్యశిబిరాలతో పేదలకు మేలు

మెట్‌పల్లి: ఉచిత వైద్య శిబిరాలతో పేద ప్రజలకు మేలు జరుగుతోందని పలువురు పేర్కొన్నారు. ఈ మేరకు మండలంలోని వేంపేటలో లైఫ్ కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మాజీ ఎంపీటీసీ రాజమల్లయ్య, రామ్మోహన్, ముత్తయ్యరెడ్డి, కొమురయ్య పాల్గొన్నారు.

✦ మాదాపూర్‌లో దంతవైద్య శిబిరం

కోరుట్లరూరల్: మండలంలోని మాదాపూర్ గ్రామంలో స్వచ్ఛంద సంస్థ కోరుట్ల సేవాదళ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీసాయి దంత వైద్యశాల వైద్యులు దంత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం గౌరవ జిల్లా అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, ఎంపీటీసీ చేపూరి కృష్ణారెడ్డి, సేవాదళ్ అధ్యక్షుడు పుప్పాల నాగరాజు, ఉపాధ్యక్షుడు వెగ్యారపు అభిషేక్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ వసంత

జగిత్యాలజోన్: జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం 2023 క్యాలెండర్‌తో పాటు డైరీని ఆదివారం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ దావ వసంత ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కొదురుపాక శ్రీనివాస్, జిల్లా మహిళా అధ్యక్షురాలు రాధిక, నాయకులు సూరమ్మ, రాకేశ్, మోహన్, యశ్వంత్, జలేందర్, రాకేశ్, తిరుపతి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ప్రకాశ్



స్వామివారి చిత్రపటం అందిస్తున్న నాయకులు

ధర్మపురి: మండలంలోని తిమ్మాపూర్‌లోని రామాలయంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఎన్నికలను నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా వావిలాల ప్రకాశ్‌గుప్తాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గుప్తాకు ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి శేషవస్త్రం కప్పి చిత్రపటం బహూకరించారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మందుబాబులు

మెట్‌పల్లి: పట్టణంలో ఆదివారం రాత్రి నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమంలో పోలీసులు వినూత్నంగా వ్యవహరించారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద తనిఖీ జరిపారు. ఈ సందర్భంగా మద్యం తాగిన పలువురు మందుబాబులను పట్టుకున్నారు. వారితో 'తాగి వాహనాలు నడపొద్దు' అనే ప్లకార్డులను ప్రదర్శింపచేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

మల్యాల: మండలంలోని నూకపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు 2004–05 విద్యా సంవత్సరం పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. ఈ మేరకు ఆదివారం తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాఘవరెడ్డి, భాస్కర్‌రావు, శ్యాంసుందర్, వేణుమాధవ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం

పెగడపల్లి: మండలంలోని ఏడుమోటలపల్లి తాండాలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇక్కడ ఎనిమిదేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. కానీ గోడల వరకు నిర్మించి వదిలేశారు. ప్రస్తుతం కేంద్రానికి సొంత భవనం లేక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని ఓ గదిలో నిర్వహిస్తున్నారు. దీంతో సరిపడా వసతులు లేక చిన్నారులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. అసంపూర్తి భవనాన్ని పూర్తి చేయించాలని అధికారులను కోరుతున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అసంపూర్తి భవనాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

సంప్రదించాల్సిన అధికారిపేరు : అబ్దుల్ రహమాన్, ఈఈ, పీఆర్
ఫోన్ నంబర్ 94404 49017

జలపతి కుటుంబానికి అండగా ఉంటాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలటౌన్: తన ఇద్దరు కూతుళ్లతో కలిసి ఇటీవల ఆత్మహత్య చేసుకున్న నర్సింగాపూర్ గ్రామంలోని గడ్డం జలపతిరెడ్డి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ భరోసా ఇచ్చారు. రైతు గడ్డం జలపతిరెడ్డి కుటుంబాన్ని ఆదివారం రాత్రి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మృతుడి భార్య కవిత, కూతురు జస్మితకు ప్రభుత్వం నుంచి సాయం అందిలే చూస్తామని హామీ ఇచ్చారు. జస్మిత చదువుల నిమిత్తం తక్షణ సాయంగా రూ.50వేల సాయం చేశారు. ఆయన వెంట జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, తదితరులు ఉన్నారు.

పట్టణ పరిశుభ్రత అందరి బాధ్యత



డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న చైర్మన్ శ్రీనివాస్

జగిత్యాలటౌన్: పట్టణ పరిశుభ్రత అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా మార్చుకోవడం సాధ్యపడుతుందని బల్దియా చైర్‌పర్సన్ గోలి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని నల్లగుట్ట డంపింగ్‌యార్డును ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి ఇంటి నుంచి వెలువడే చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి బల్దియా వాహనాలకు అందించాలని కోరారు. డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తను బయోమైనింగ్ చేయడానికి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. తడి చెత్తను ఎరువుగా మార్చి విక్రయించడం ద్వారా బల్దియాకు ఆదాయం సమకూరేలా చూస్తామన్నారు. పొడి చెత్తను రీసైక్లింగ్‌కు పంపడం ద్వారా డంపింగ్ యార్డుల వద్ద చెత్త నిల్వలు పేరుకుపోకుండా చూస్తామన్నారు. బల్దియా కమిషనర్ బోనగిరి నరేశ్, కౌన్సిలర్లు బొడ్ల జగదీష్, పంబాల రాము, కూతురు రాజేశ్, నాయకులు బద్దం జగన్, బండారి నరేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అశోక్, రాము ఉన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



సంజయ్‌కు జ్ఞాపిక అందిస్తున్న బ్రహ్మకుమారి

కోరుట్లరూరల్: మండలంలోని కల్లూరు గ్రామ శివారులో గల శివాలయంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వనతడుపుల అంజయ్య, ఎంపీటీసీ చిట్నేని లత, ఉపసర్పంచ్ సంకె రాకేశ్, అర్చకులు నారంబట్ల భరద్వాజ పాల్గొన్నారు.

ముందస్తు శివరాత్రి వేడుకలు..

కల్లూరు గ్రామ శివారులో గల బ్రహ్మకుమారి కేంద్ర ఆలయంలో ముందస్తు శివరాత్రి వేడుకలు ఆదివారం నిర్వహించారు. వేడుకల్లో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డా.కల్వకుంట్ల సంజయ్, ఎంపీపీ తోట నారాయణ, సర్పంచుల ఫోరం గౌరవ జిల్లా అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, సర్పంచ్ వనతడుపుల అంజయ్య పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న జాతర

కోరుట్ల: పట్టణంలోని భీముని దుబ్బలో గల కొమురవెల్లి మల్లన్న ఆలయంలో ఆదివారం జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, కల్యాణం ఘనంగా నిరహించారు. భక్తులకు అన్నదానం చేశారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కల్వకుంట్ల సంజయ్ పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, ఎంపీపీ తోట నారాయణ, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, టీఆర్‌ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశ్ పాల్గొన్నారు.

సాగునీటి కోసం చివరి ఆయకట్టు రైతుల శ్రమదానం



పూడిక తీస్తున్న రైతులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం రోల్లవాగు ప్రాజెక్టు దిగువన 2ఎల్ కాలువ కింద రైతులు తమ పొలాలకు సాగునీటి కోసం ఆదివారం ఆరుగంటల పాటు శ్రమించారు. నర్సింహులపల్లె మీదుగా కొల్వాయి, దొంతాపూర్ గ్రామాల రైతుల పొలాలకు రోల్లవాగు ప్రాజెక్టు నీటిని విడుదల చేసినప్పటికీ 2ఎల్ కాలువలో పలుచోట్ల పూడిక, చెత్త పేరుకుపోవడంతో పొలాలకు నీరు చేరడంలేదు. దీంతో కొల్వాయి గ్రామ సింగిల్‌విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, రైతుసంఘం నాయకుడు వోరుగంటి రమేశ్ ఆధ్వర్యంలో రైతులు శ్రమదానం చేశారు. చెత్తను, పిచ్చిమొక్కలను తొలగించగా కొన్ని చోట్ల జేసీబీ సాయంతో తూములో పేరుకుపోయిన చెత్తను తీసివేశారు. నర్సింహులపల్లె సర్పంచ్ రిక్కల ప్రభాకర్ ట్రాక్టర్ సమకూర్చడంతో కాలువ నుంచి తొలగించిన చెత్తను, పిచ్చిమొక్కలను వెంటవెంటనే డంపింగ్‌యార్డుకు తరలించారు. ప్రస్తుతం రైతుల పొలాల్లోకి నీరు సాఫీగా వెళ్తోంది.